BOOK POST- PRINTED MATTER
Postal Regd.No. VSP-142/2009-2011

★ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in

Head Office : D.No. 3-178, 5th Lane,
ADARSH NAGAR, VISAKHAPATNAM-530 040

RNI APTEL /2006/17980

Published from VISAKHAPATNAM | సంపుటి : 4 | సంచిక : 18 | ఎడిటర్ : వై.కనకరాజు | 2010 మే 16-31 | పేజీలు : 8 | వెల : 5/-

★ రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

★ ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు

*(గతసంచిక తరువాయి....)*

నేటి దినాలలో కూడా అనేకులు తమ దుష్టక్రియలు విడిచి మంచివారిగా సమాజానికి ఉపయోగపడుట చూస్తున్నాం. ఇంకొందరు మొదట మంచివారిగానే కన్పడినా తుదకు దుష్టులుగా పరిగణింపబడుట చూస్తుంటాం. అయితే అందరు మంచిగానే ఉండాలని దేవుడు కోరతారు. అంతటి ప్రేమామయుడే మనందరి కన్న తండ్రియైన సర్వోన్నతుడైన దేవుడు.

★ **యెవని ప్రవర్తనను బట్టి వానికి శిక్ష విధింతును. మనస్సు త్రిప్పుకొని మీ అక్రమములు మీకు శిక్షా కారణములు కాకుండునట్లు వాటన్నింటినీ విడిచిపెట్టుడి**

పై వచనంలో మనపై దేవుని కెంత ప్రేమో అర్ధమవుతుంది. తప్పు చేయనివాడెవడు? తప్పును సరిచేసుకొని బ్రతుకువాడే మనిషి. అధికారమొచ్చింది కదా అని ఇష్టారాజ్యంగా ప్రవర్తించువారెందరో చరిత్రలో నశించారు. మరెన్నడును కనబడకుండా పోయారు. ఎవరైనా తమకు వచ్చిన అధికారం దేవుడిచ్చినదని గుర్తెరగాలి. ఆ అధికారంతో ఆ ప్రాంతీయులైన తన పిల్లలకు సేవచేయుటకే దేవుడు తనను ఏర్పాటు చేసుకున్నాడని గ్రహించాలి. నేను, నాది అనుకునేవారెందరో కాలగతిలో కలసిపోయారని గ్రహించాలి. ఇంకొకసారి ఎన్నికలందు పోటీ చేయుటకు తమ బ్రతుకు కాలంలో అవకాశం లేనటు వారెందరో గలరు. వారిని చూసైనా ఇప్పటి ఎన్నికలందు గెలిచినవారు మార్పు చెందాలని దేవుడు పెట్టిన ఉదాహరణగా వారిని భావించాలి. దేవుని ఇష్టాన్ని చిత్తాన్ని సంపూర్తిగా తెలుసుకొని , ప్రేమించి బ్రతికిన వారున్నారా? అని లేఖన భాగాలను చూస్తే ... తండ్రియైన దేవుని ఉద్దేశ్యాన్ని భూమిపై బ్రతుకున్నప్పుడు మన ప్రభువైన యేసుక్రీస్తు నెరవేర్చునట్లు కనబడుతుంది. దేవుని ఉద్దేశాలన్నియు క్రీస్తుకు పూర్వ ప్రవక్తలచే వందల సంవత్సరాల కాలంలో ప్రవచించ




బడియున్నాయి. వేర్వేరు కాల సమయాలందు ఆయా ప్రవక్తలు దైవాత్మచే పలికినారని అవన్నియు సంపూర్ణంగా క్రీస్తు నెరవేర్చినట్లు లేఖనాలు సాక్ష్యమిస్తుంటే ఆశ్చర్యపోనివారెవరు? మరికొన్ని వచనాలు క్రీసస్తులో నెరవేర్చబడినట్లు బైబిల్లో చూడగలం. అవి చదివిన మన హృదయాలు తెరువబడి వెలిగింపబడాలి. వాక్యాగ్నితో మండాలి. అపుడే మనం క్రైస్తవులనిపించుకుంటాం.

★ **ఆ రాజుల కాలములలో పర లోకముందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించెను. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నింటినీ పగులగొట్టి నిర్మూలము చేయును గానీ, అది యుగముల పర్యంతం నిలుచును.**

పై లేఖనం మానవ చరిత్రలో నెరవేరబడినట్లు చరిత్రను చదువుటను బట్టి తెలుస్తుంది.

యేసుక్రీస్తు లోకానికి దేవుని రాజ్యము వచ్చుననే ప్రకటనతో సువార్త ప్రారంభించారు. అలా ప్రకటిస్తూ ... దేవుని రాజ్యము వచ్చేయున్నదని, అది మీ మధ్యనే యున్నదని, ఆయనే స్వయంగా చెప్పుటచే దేవుని రాజ్యము వచ్చేయున్నదని గ్రహించాలి. అది మీ మధ్యనే యున్నదని ఆయనే స్వయంగా చెప్పుటచే దేవుని రాజ్య పరిపాలన అప్పుడే మొదలైందని కూడా గ్రహించాలి. మానవాళికి మహోపకారిగా, తరువాత దినాలలో శకపురుషుడిగా కీర్తించబడు యేసుక్రీస్తు భువిపైన దేవుని శక్తిని, ప్రేమను లోకానికి బయలు పరచినప్పుడే

*2లో...*


ఆత్మాహుతులా? ఆత్మరక్షకులా? 2లో..
అతిశయం (ఎడిటోరియల్) దేవుని జ్ఞానం – మానవ విజ్ఞానం 3లో..
వాక్యమా? లౌక్యమా? & బ్రదర్ అంటే...! 4లో..
విశాఖయే తెలుగు బైబిలుకు పుట్టినిల్లు!
ప్రార్థనంటే విలువుందా(చాకిరేవు) 5లో..
బైబిలుపై సందేహాలు, ప్రశ్నలు - జవాబులు
బైబిలు చదివి గ్రహించుటకు సులువైన మార్గం..! 6లో..
తెలుసుకుందాం 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా' 7లో..
మథర్ థెరిస్సా-09 8లో.. ప్రపంచ ప్రార్థనాదినం

## జ్ఞాపకముంచుకోండి!

అనంతపురం జిల్లా హిందూపుర్‌లో విద్యార్థిని మంజుల జిల్లా టాపర్. ఆ పాపతో వాళ్ల టీచర్ చెప్పిన మాటగా... 'పేదరికంలో పుట్టడం తప్పుకాదు, పేదరికంలో మరణించడం తప్పు' అని మీడియాకు తెలిపింది. ఆ మాటే తనను ఎంతో ఉత్తేజింపజేసిందనీ చెప్పింది మంజుల. చదువుకు పేదరికం అడ్డు అనుకున్న వారు ఈ విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి.

## జగన్ యాత్ర ఆయనకే నష్టం కల్గిస్తుందా?!

అవునంటున్నారు విశ్లేషకులు! అధిష్టానాన్ని ధిక్కరించేట్లు కన్పించిన వారెవరూ కాంగ్రెస్‌లో ఎదగలేరన్నది వైయస్ జగన్ ఎంతవేగంగా గుర్తిస్తే అంత మంచిదంటున్నారు. తండ్రివలె దుడుకు స్వభావం సహజంగానే జగన్‌కుంటుంది. దూకుడుగా ఉన్నన్నాళ్లూ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కూడా పార్టీలో ప్రముఖునిగా ఎదగలేకపోయారు. ఎన్నో ఆటుపోట్లు తిన్న తర్వాత అపార అనుభంతో అధిష్టానానికి తనయందు సంపూర్ణ నమ్మకం కల్గించుకొన్నారు. జగన్ అది తెల్సుకొని ముందుకు సాగితే మంచిదని హితవు చెబుతున్నారు. ఓదార్పుయాత్రలో జరిగిన సంఘటనలు కేవలం జగన్‌కే ఆపాదించబడ్డాయన్నది నిర్వివాదాంశం. తద్వారా అధిష్టానానికి మరింత దూరమే అయ్యారు జగన్. ఇది సలహాదారుల లోపమా



లేక స్వయంకృతమా? అన్నది జగనే ఓసారి చూసుకొంటూ ముందుకు సాగాలంటున్నారు. చూడాలి మరి, జగనేం చేస్తారో!

## జీతం 15 కోట్లు



రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) అధిపతి ముఖేష్ అంబానీ సంవత్సరానికి గాను తీసుకొంటున్న జీతం 15 కోట్లు. అయితే వాటాదార్ల నుంచి లభించిన ఆమోదాన్ని బట్టి 39 కోట్ల 36 లక్షలు పొందొచ్చుట! కాని తమ సంస్థలో మేనేజ్‌మెంట్ విభాగ ఉన్నతాధికారుల జీతాల చెల్లింపులో పరిమితులను పాటించే నిమిత్తం వారికి ఆదర్శంగా నిలిచేందుకే ఆయన 15 కోట్లే తీసుకొంటున్నారు. వారి స్వసంపాదనలోనే ఇట్టి నియంత్రణ చూపుతున్న ముఖేష్ అంబానీ అభినందనీయులే. దుబారా ఖర్చులు వెలగబెడుతూ ప్రజాసొమ్ములను హరించివేస్తున్న వారెందరికో ఇది మార్గదర్శకం కావాలి. దేవుని పేరున ఆయాచితంగా కానుగా వచ్చే సొమ్ములను సొంతావసరాలకు వాడుకొంటున్న వారికిది చెంపదెబ్బే! అవునంటారా?

*లోకోక్తులు : భయం నీ చెంత చేరినప్పుడు ఆత్మ విశ్వాసాన్ని మేల్కొలుపు. అపుడు భయం నీ దరి చేరదు. - మార్టిన్ లూథర్ కింగ్.*
*ద్వేషాన్ని ద్వేషంతో ఎప్పటికీ ఎదిరించలేం. ప్రేమే దానికి సరైన మందు -గౌతమ బుద్ధుడు.*

## సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల ప్రతిభ

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకొన్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 85.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్సీ గృహాలనుంచి 26 వేల మందికిపైగా హాజరై 22 వేలకు పైగా ఉత్తీర్ణులయ్యారు. పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో 90 శాతం పైనే ఉత్తీర్ణత నమోదైంది. ఇదెంతో శుభపరిణామం. కార్పొరేట్ విద్యకై ఎగబడుతున్న మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లల విషయంలో ఈ ఉత్తీర్ణతా శాతాలను చూసైనా మార్పునొందాలి.

★ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము




*(మొదటి పేజీ తరువాయి..)*

దేవుని రాజ్యం ఆరంభమైందని గ్రహించుటే ప్రాముఖ్యం.

క్రీస్తు శిలువ ద్వారా సర్వలోక పాపాల కొరకు తన పరిశుద్ధ రక్తం చిందించి, మరణించి, మరణాన్ని జయించి, దైవాత్మ స్వరూపంతో తిరిగిలేచినపుడే దేవుని రాజ్యం స్థాపించబడినదని లేఖనాలు నొక్కి వక్కాణిస్తున్నాయి. అందుకారణంగానే క్రీస్తు శిష్యుడైన యోహానుచే 'ఆ రాజ్యంలో పాలివాడనైన' అనుపదం దేవుడు వ్రాయించారు. రాజ్యం స్థాపించ బడితేనే కదా ఎవరైనా పాలివారవగలరు. దేవుని కుమారునిగా ప్రపంచంలో అత్యధికులచే కీర్తించబడుచున్న వారే మన ప్రభువైన యేసుక్రీస్తు. సర్వోన్నతుడైన దేవుని కుమారునిగా ఆయన సశరీరుడుగా ప్రత్యక్ష మైనట్లు లేఖనాలు సాక్ష్య మిస్తున్నాయి. అందుకు తగిన విధంగానే లోకంలో ఆయన జీవనం సాగింది. మానవత్వంలో సర్వోన్నతత్వాన్ని సుసంపన్నంగా చూపి సర్వోన్నతునిగా మన ప్రభువైన యేసుక్రీస్తు ఘనపరచు బడుచున్నారన్నది నిర్వివాదాంశం. ఆనాడు మానవునిగా... మనతో సమానానుభవం కలవానిగా... ఆ తరంవారితో జీవిస్తూ దైవత్వం ఎలా ఉంటుందో చూపిన ప్రేమామయుడే మన ప్రభువైన యేసుక్రీస్తు. మానవులందరును దైవతత్వంలో ఎలా జీవించవచ్చో మార్గం చూపిన మహామనిషే ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన ద్వారా స్థాపించబడిన దేవుని రాజ్యం ఆనాటి నుండి ఈనాటి వరకు అప్రతిహతంగా కొనసాగుతుంది. పైన లేఖనంలో వ్రాయబడినట్లు దానికెన్నటికినీ నాశనము కలుగదు. ఆ రాజ్యంలో పాలివారైన క్రైస్తవులెందరో తమ తమ జీవితాలలో గల చెడు స్వభావాలు నిర్మూలించబడి క్రొత్త జీవితాలు జీవిస్తూ సజీవ సాక్షులుగా ఉంటున్నారు. వారు మరనేకులకు ఆశ్చర్యం కలిగించువారిగా, క్రీస్తుకు సజీవ సాక్షులుగా ఉంటూ లోకస్థులకు కనుబడుట క్రీస్తును ప్రకటించుటే సుమా ! వారిలో ఎవరిని కదిపినా ఒక సజీవ సాక్ష్యం బయలుపడుతుంది. ప్రేమ అన్నింటిని కప్పునని, ప్రేమ నిత్యం నిలుచునని చెప్పిన ప్రభువైన యేసుక్రీస్తుకు సజీవ దర్పణాలే అనేక క్రైస్తవ జీవితాలు. క్రైస్తవులైనందుకు శ్రమను అనుభవిస్తే దానిని బట్టియే దేవుని మహిమ పరచాలనే అత్యద్భుత లేఖన భాగాన్ని నెరవేర్చుటకు ఇష్టపడువారే నిజ క్రైస్తవులు. క్రీస్తును క్రీస్తుగా ఎరిగిన వారి జీవన విధానాలే వేరుగా ఉంటాయి. క్రీస్తును అంగీకరించుట అంటే మనస్సు మారి తమ మార్గం మార్చుకొనుటే అని గ్రహించాలి. మన ప్రభువైన యేసుక్రీస్తు వ్రాయబడిన విధంగా పోవుచున్నాడని బైబిల్లో వ్రాయబడింది. అది దేవుని ఉద్దేశ్యం. ప్రవక్తల ద్వారా వ్రాయబడింది.

అందుకు అనుగుణంగానే ఆయన జీవించారు. క్రీస్తు తరువాత తరం వారు ఆయనను గూర్చి ఈ విషయంలో ఇచ్చిన సాక్ష్యమే బైబిల్లో చూస్తున్నాం. మరి మనం ఎలా పోతున్నామో ఆలోచించుకోవాలి. దేవుడు మన గూర్చి కూడా వ్రాసి ఉంటాడనుటకు సందేహమక్కరలేదు. తన కుమారుని గూర్చి వ్రాసిన దేవుడు మన గూర్చి వ్రాయడా? తప్పక వ్రాస్తాడు. దేవుని చిత్తం ప్రకారం వ్రాయబడిన విధంగా అనగా ఆత్మ నడిపింపు ద్వారా మనం కూడా జీవించాలి. అపుడే మనం కూడా సర్వోన్నతుని పిల్లలమై ఉంటాము. దేవునియందు భయభక్తులు కలిగి జీవించాలి. దేవుని యెడల యేసుక్రీస్తు అలా జీవించునట్లు వ్రాయబడి సాక్ష్యం కలిగి వున్నారు. అందుకే నేటి ప్రపంచంలో మరెవ్వరికి లేని, రాని అధికృత గలవారై శక పురుషునిగా ఆయన కీర్తించబడుతున్నారు. ఏమి చెప్పాలన్నా, ఏమి చేయాలన్నా ఆయన శకాన్ని బట్టియే చెప్పాలి. లేఖనాల సాక్ష్యాలే మనకు బలం. లోకాన్ని తన క్రీస్తు శకం ద్వారా శాసించుటను బట్టి ఆయన సర్వం మీద ఉన్న తునిగా కనుబడుట వలన ఆయనను 'సర్వోన్నతుని'గా భావించుట అతిశయోక్తి కానేరదు. ఆలోచించండి!

*<u>టిప్స్</u> : ❁ అరటికాయ ముక్కలను నీటిలో ఉడికిస్తున్నప్పుడు చెంచా నూనె, కాస్త నిమ్మరసం కలపండి. దీనివల్ల జిగురు తొలగిపోయి ముక్కలు రంగుమారకుండా ఉంటాయి.*

*❁ అప్పటికప్పుడు చింతపండు నుంచి రసం తీయాలంటే... చింతపండుని కొద్దిసేపు నీటిలో ఉడికించి చిటికెడు ఉప్పు కలిపి పిసికితే రసం త్వరగా వస్తుంది.*

*❁ గాజు గ్లాసులు కొత్తగా మెరవాలంటే... ముందుగా వాటిని డిటర్జెంట్ పొడితో రుద్ది ఆ వెంటనే ఎప్సంసాల్ట్‌తో శుభ్రపరచాలి.*

*❁ ఫర్నిచర్‌పై పడ్డ చెమట మరకలు తొలగించాలంటే వైట్ వెనిగర్‌లో ముంచిన వస్త్రంతో తుడవాలి.*

*❁ సింక్ నుంచి దుర్వాసన రాకుండా ఉండాలంటే అడుగున ఓ కప్పు బేకింగ్ సోడా ఉంచండి.*

# ఆత్మాహుతులా? ఆత్మరక్షకులా?



*<u>గాజువాక :</u>* స్థానిక ఆదర్శగ్రౌండ్‌లో ఆత్మాహుతులా? ఆత్మ రక్షకులా? అన్న పేరుతో బ్రదర్ బి. సుధాకర్, బ్రదర్ టి. కరుణాకర్‌లు దైవజ్ఞాని, ఆత్మజ్ఞాని, జయశాలి పి.డి. సుందరరావు ముఖ్య వక్తగా సభలు ఏర్పాటు చేస్తారు. ఈ సభలు మే 21 నుండి 26 వరకు జరిగాయి. పరిసర ప్రాంతీయులందరూ పాల్గొని సభలను విజయవంతం చేసారు. ఈ సభల్లో ముఖ్య వక్త పి.డి. సుందర రావు ప్రముఖ క్రైస్తవనాయకులను, రాజకీయ నాయకులను, మీడియాను కూడా సవాలు చేసారు. ఈ విషయంలో క్రైస్తవులకిది ఎంతమాత్రం తగదని కొందరు చర్చించుకున్నారు. ఇలా ఒకరినొకరు విమర్శించుకుంటూ పోతే కొన్నాళ్లకు సభలకు ఆమోదం లభించుట కష్టమౌతుందేమోనన్న ఆందోళన వ్యక్తపరిచారు. బైబిలును బట్టి బోధిస్తే ఆ బోధలే ఎదుటివారిని ఆలోచింపజేస్తాయనుట నిర్వివాదాంశం. తప్పుగా ప్రవర్తిస్తున్న వారికి ఆ బోధలే సవాలుగా అన్పిస్తూ వారి బ్రతుకులను మార్చుటకు ఉపకరిస్తాయి. అంతేగాని వ్యక్తిగతంగా ఎవరినైనా సవాలు చేసేందుకు ఈ లోకంలో బ్రతుకుతున్నంతకాలం ఎవరికి అవకాశం ఉండదు. మనం ఒకదాంట్లో ఎదుటివారిని తప్పుబడితే వారు మరో దాంట్లో మనల్ని తప్పు బడతారన్నది ఎరగాలి. సాధారణంగా తప్పులు చేయని వారుండరు. చేసిన తప్పులను మరలా మరలా చేయకుండా మున్ముందుకు సాగడమే మనుష్యులకు మంచిది. 'దేవుడు మంచివాడు ఆయన వాక్యం సత్యము'. ఇదే మన బోధలకు ఆధారం కావాలి. తద్వారానే అందరిలో మార్పు తీసుకురాగలం. మన ద్వారా చెప్పబడిన వాక్యమే ఎదుటివారికి సవాలు చేసేదిగా కన్పడాలన్న నిజాన్ని పి.డి. సుందరరావు ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిదన్న చర్చలు ఆ ప్రాంతంలో బహు బలంగా విన్పించాయి. అయితే బైబిలు యొక్క గొప్పతనాన్ని వేదికలపై చెప్పుటలో తెలుగు క్రైస్తవుల్లో పి.డి.సుందరరావును మించిన వక్త ఇప్పటివరకు రాష్ట్రంలోనే లేరని చెప్పుకున్నారు. తెలుగు వారే కాదుగాని తామిప్పటివరకు విన్న, చూసినా వారిలో కూడా అంత గట్టిగా వేదికపై బైబిలును గూర్చి చెప్పేవారు లేరన్నారు. బైబిలు మతగ్రంథం కాదని, క్రైస్తవం విదేశీమతం కాదని ప్రకటించుటలో పి.డి. సుందరరావు శైలి ఎన్నదగినది. బ్రదర్ బి. సుధాకర్, బ్రదర్ టి. కరుణాకర్‌లను గురించి మాట్లాడుతూ... చిన్న వారైనా దేవునియందలి ప్రేమతో ఈ సభలను ఏర్పాటు చేసారని అందుకు వారు ఎంతో అభినందనీయులని పి.డి.సుందరరావు చెప్పారు. వేదికపై చేసిన సవాళ్లకు ఎవరెలా స్పందిస్తారో, తదుపరి పరిణామాలెలా ఉంటా యో నన్న ఉత్సుకత ఆహుతులనేకుల్లో కన్పడింది. చూడాలి మరి, రాబోవు రోజులు క్రైస్తవ సభలకు సహకారంగా ఉంటాయో ఆటంకంగా పరిణమిస్తాయో!






క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు
వివరాలు సంపూర్ణంగా తెల్సుకొనేందుకు సంప్రదించండి!

| B&W | FULL PAGE | HALF PAGE | QTR. PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 4,500/- | 2,250/- |
| CENTRE PAGES | 5,000/- | 2,500/- | 1,250/- |
| REAR PAGE | 8,000/- | 4,000/- | 2,000/- |

| COLOUR | FULL PAGE | HALF PAGE | QUATER PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 9,000/- | 4,500/- |
| CENTRE PAGES | 8,000/- | 4,000/- | 2,000/- |
| REAR PAGE | 16,000/- | 8,000/- | 4,000/- |

ఫోన్స్ : 9346960601, 9490266640, 9292006116



క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



సంపుటి : 4 సంచిక : 18 16 -31 మే , 2010

☆ ☆ ☆

# అతిశయం

ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఓ విషయంలో అతిశయం కన్పడుట సహజం. మనుష్యులు అతిశయించుట మంచిదే! కానీ తాము కన్పరచే అతిశయం ఎదుటి వారిని దూరం చేయకూడదు. అట్టి అతిశయం మనిషిని పతనానికి చేరుస్తుంది. తమ నెవరికీ దూరం చేయని అతిశయమే ఉత్తమాతిశయమని గ్రహించు వారే విజ్ఞులు. ఇట్టి అతిశయముంటుందా? అసలు అతిశయమంటేనే ఎదుటి వారిని ఏకొంతైనా నొప్పించేది కదా అన్న అనుమానం మీకు రావచ్చు. నిజమే! లోకంలో గల విషయాలను బట్టి ఎవరు అతిశయించినా ఎదుటివారికి నొప్పి కలగొచ్చు. తద్వారా ఒకరియందొకరు ద్వేషాభావాలను పెంచుకొనేందుకు ఆస్కారముంది. లోకానికి భిన్నంగా ఉండేదే పరలోకం. పరలోకానికి మార్గాన్ని తెలిపే బైబిలు 'అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెనని' అంటుందని గమనించాలి. ప్రభువునందు అనగా వాక్యమందు అతిశయించువారు దేవునికిష్టులు. అది దేవుని చిత్తం. మనలో ఎవరైనా వాక్యంలో అతిశయించుట కన్పడితే దేవుని వాక్యసారాంశాన్ని బట్టి వారిని గౌరవించాలి. వారిలా అతిశయించేందు ప్రయత్నించాలే గాని వారిని చూసి ఈర్ష్యా సూయలు చెందరాదన్నది గమనార్హం. వాక్యంలో అతిశయించు వారిని చూసి సజ్జనులైతే సంతోషిస్తారు. దుర్జనులైతేనే ఈర్ష్యా సూయలకు లోనై అంతకంతకు చెడిపోవుదురని బైబిలు పండితులు, పెద్దలు చెప్పిన మాటలెంతైనా నమ్మదగినవే సుమా! లోకాతిశయం అందరిని దూరం చేస్తుంది. దైవాతిశయం సజ్జనులను పురిగొల్పుతుందన్నది మన మస్తిష్కాల్లో నిక్షిప్తమవాలి. అపుడే దేవునిలో అనగా వాక్యంలో ఎదుగగలం, అతిశయింపగలం. తద్వారా అతిశయించువాడు ప్రభునందే అతిశయింపవలెనన్న వాక్యాన్ని మనలోనూ నెరవేర్చుకోగలం! ఏమంటారు?

★ "ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము...... మా కొరకు ప్రార్థించుడి"

గమనిక : మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలని గమనించగలరు.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వై.కె.రాజు, వై.ఎల్. రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

క్రైస్తవనాడులో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తి గత అభిప్రాయాలు మాత్రమే. పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

క్రైస్తవనాడు విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి.మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి.

CHRISTAVANAADU ON LINE A/C Current Account No. : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsh Nagar Branch, Visakha-530 040.

సం॥ చందా రూ. 200/-లు. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు ఉచితం! చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం భాధ్యత వహించలేం. పాఠకులిది గమనించి సహకరించగలరు. -ఎడిటర్. సంప్రదించండి : 9490266640, 9346960601.

## దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 67

| బైబిల్ | | సైన్స్ |
|---|---|---|
| దేవుని మాట | × | శాస్త్రజ్ఞుల మాట |

"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్స్ సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలలియజేప్పుటకు చేయు ప్రయత్నమే ఈ "దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్దేశము.



- వై.ఎల్. రవిరాజు

### ★ నీ భోజనపు బల్లచుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కలవలె నుందురు.

తల్లి గర్భంనుండి బయటకు వచ్చిన బిడ్డను చూచిన వారందరూ ఆ బిడ్డ అలా ఉన్నాడు, ఇలా ఉన్నాడని అనుకొనుట చూస్తుంటాం. ఆ శిశువును ఎంతో జాగ్రత్తగా చూడాలని ఆరాటపడిపోతుంటారు. ఆ శిశువు భవిష్యత్‌లో ఏలోటూ రాకుండుటకే ప్రతీ విషయంలో ఎన్నో ప్రణాళికలు వేస్తుంటారన్నది జగద్విదితం. కాని ఆ శిశువుకి తన తల్లిదండ్రులు ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలియదు. ఆ శిశువు నవ్వుతుంటే ఆ తల్లిదండ్రులు ఎంతో మురిసిపోతుంటారు. ఆ శిశువు కోరికలను తీర్చుటకై ఎంతో ప్రయాసపడుతుంటారు. తద్వారా వారెంతో ఆనందం పొందుతుంటారు. వారి కోరికలను కూడా వదిలి వారి బిడ్డ కోరికలను తీర్చుటకు ఆరాటపడుతుంటారు. అలాగే భూమ్మీద పుట్టిన ప్రతి మనిషికి కోరికలు అనేకంగా ఉంటాయి. వాటిని పొందుటకు అనేక శ్రమలు పడుతుంటారు. అది పొందకపోతే, పొందిన వాటితోనే జీవితాన్ని గడిపేస్తారు. స్థిరపడి ఒక స్థాయికి వచ్చిన తరువాత వారికి పెళ్ళి, పిల్లలు. ఆ పిల్లలను పెంచుటలో అనేక విధములైన జాగ్రత్తలు. వారిని మంచి స్థితిలో చూడాలని ఆశలు. ఆ పిల్లలు స్థిరపడిన తరువాత వారిమీద ఆదారపడి, ఉన్న కొద్ది జీవితాన్ని జీవించటం. అటూ తరువాత వారికి మరణం సంభవించి ఈ లోకంలో తమ జీవితాన్ని చాలించి వెళ్ళిపోతారు. వారు మరణించిన తరువాత సంతాప సభలు చేస్తూ, కుటుంబ సభ్యులు రెండుమూడు రోజులు గుర్తుంచుకుంటారు. తరువాత ఎవరి పని వారిది. ఇలానే వారి పిల్లలు జీవితంలోనూ జరుగుతుంది. ఇది తరతరాలుగా జరుగుతున్న నిత్య సత్యం. ఇందుకేనా మన జన్మ? తరతరాలుగా ఇలా జీవించుటకేనా? అలా ఎన్నటికీ కాకూడదు. శిశువు పుట్టక మునుపు తల్లి గర్భంలో దేవుడే ఆధారం. గాని అనేక బిడ్డలు పెరిగి పెద్దైన తర్వాత జీవించే జీవితంలో 'దేవుడు' అన్న పదానికే చోటులేకుండుట చూస్తుంటాం. అనేకులు దేవుని నమ్మిన వారు దేవునిపై ఆధారపడటం అంతగా కన్పడదు. నామకార్థానికే వీరికి దేవుడు. ఇదంతా ఆలోచిస్తే దేవునిపై ఆధారపడుతూ జీవిస్తున్న వారికి కొంత బాధాకరంగానే ఉంటుంది. ఇది చదువుతున్న మీరు కూడా ఆలోచించాలి! జీవితంలో 'దేవుడు' అన్న పదానికి ఎంత విలువుంచారో? ఎంత వరకు ఆధారపడ్డారో? గర్భంనుండి ఎంతో జాగ్రత్తగా బయటకు తీసిన దేవుడు మనలను జీవితాంతం జాగ్రత్తగా చూడరా? గ్రహింపులోపంవల్లే ఈ కొద్ది జీవితాన్ని సార్థకత చేసుకొనుటలో ప్రయాసపడుతుంటారేగాని మన:శాంతిగా బ్రతకుటలో అనేకులు విఫలమౌతున్నారు. ఇది వారి సుఖజీవనానికి వారినే ఉత్తరవాదులు చేస్తుందనుట నిజం కాదంటారా? అవుననే చెప్పాలి. ఎంత డబ్బున్నా సుఖంగా జీవిస్తున్నారని చెప్పలేరు. అన్ని ఎదుటే ఉంటాయి. గాని మన:స్ఫూర్తిగా తినలేరు. ఈలోకంలో చరస్థిరాస్తులు ఎన్నున్నా వాటిని అనుభవించే అవకాశం ఉండకపోవుట చూస్తున్నాం. దానిక్కారణం ఆరోగ్యం లేక మరేదైనా కావచ్చు. ఈలోకంలో చరస్థిరాస్తులకై వెంపర్లాడనివాడు దేవునిలో ఎంతో సంతోషంగా ఎదుగుతుంటాడు. పైన చెప్పుకున్నట్లు అన్నీఉన్నా కూడా ఏమీ అనుభించలేనివారు తమ కున్న చరస్థిరాస్తులను దైవాశీర్వాదంగా చెప్పుకొనుట అనేక సార్లు వింటుంటాం. ఇది ఆశీర్వాదమా?! అన్నీ ఉండి అనుభవించే స్థితి లేకపోతే దానిని దేవుడు ఆశీర్వాదమనలేదు. ఏదీ లేకపోయినా కుటుంబం యావత్తూ ప్రార్థనచేస్తూ సంతోషంగా భోజనం చేయుట ఆశీర్వాదమని దేవడు తన గ్రంథంలో వ్రాయించారు. లోకంలో మన జీవన విధానం ఎలా ఉండాలోనన్నది తెలిపేందుకు అవసరమైన ప్రతీ మాట దేవుడు బైబిల్లో వ్రాయించారు. మనం వాటిని అనుసరిస్తే చాలు. మన బ్రతుకులు ఆనందంగా ఆశీర్వాదకరంగా ఉంటూ లోకస్థులకు మాదిరిగా కన్పడతాయి. ఇది క్రైస్తవులందరూ ఎరుగుట అవశ్యం.

**★ మీరును మీ దేవుడైన యెహోవా మిమ్మునాశీర్వదించి మీకు కలుగజేసిన మీ కుటుంబములును మీ దేవుడైన యెహోవా సన్నిధిని భోజనముచేసి మీ చేతి పనులన్నిటియందు సంతోషింపవలెను.**

పై వాక్యంలో వలే ఉండేందుకు ప్రతీవారు ప్రయత్నించాలి.

గమనిక: మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి గమనించగలరు.

★ ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును

వై.కనకరాజు, వై.ఎల్. రవిరాజులు వ్రాస్తున్న ప్రతి వివరణ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం! పాఠకులిది గమనించగలరు. అందుకై తదుపరి సంచికలు ఫాలో అవ్వండి.

## క్రైస్తవనాడు యెడల దేవుడు చేసిన కార్యాలు...!

దేవుని కృపతో క్రైస్తవనాడు ప్రారంభానికి ముందు మాకష్టార్జితం (పెయింటింగ్ కాంట్రాక్టులు)తో ఇష్టంగా యేసుక్రీస్తు పరిచర్యను కరపత్రాలు వ్రాసి పంచుట ద్వారా చేసేవారము. ఆ పరిచర్యను యేసుకు ఇచ్చాం. ఆయన తండ్రిని వేడుకొని దీవించి మాకు క్రైస్తవనాడుగా మార్చి ఇచ్చారు. ఇలా ఎవరి విషయంలోనైనా నెరవేరగలదు. తమ కష్టంతో ఇష్టంగా దేవుని కొరకు పనిచేస్తే ఆ పనిని దీవించే దేవునినే మనం కలిగున్నామని గుర్తుంచుకోవాలి. ఏ పనీ చేయక కేవలం పరుల సొమ్ములతోనే సేవ చేసేద్దాం అనుకున్న వారెవరూ సేవ చేయ్యలేరు. నేడు బహుఘనంగా దేవుని సేవ చేస్తున్న వారందరూ ఓనాడు తమ కష్టార్జితాన్నే దేవునికి వినియోగించారని నిర్ద్వందంగా చెప్పగలం. ఆ కష్టాన్నే తర్వాత కాలంలో దీవెనగా మార్చుట దేవునికి తగును. కాబట్టి సేవలోకి కొత్తగా వస్తున్న వారందరు ఇది గమనించి, ఆచరించాలని కోరుతున్నాం. మా జీవితంలో కరపత్రాలే క్రైస్తవనాడుగా మారుటకు పట్టింది కేవలం ఒక సంవత్సరన్నర కాలమే. అందుకు దేవునికి స్తోత్రము. అప్పటినుండి అప్రతిహతంగా దేవుని దయయందును, మనుష్యుల దయయందును ఘనంగా నడుస్తోంది క్రైస్తవనాడు.రాష్ట్రావతరణం జరిగినప్పటినుండి ఇప్పటివరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండి 'రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా' (ఢిల్లీ) వారి సర్టిఫికేట్ పొందిన మొదటి క్రైస్తవ పేపరు క్రైస్తవనాడు. అలాగే విశాఖ నుండి రాష్ట్రాలు దాటిన మొదటి క్రైస్తవ ఆధ్యాత్మిక సామాజిక న్యూస్ పేపరు క్రైస్తవనాడు అనుట అతిశయోక్తి కాదు సుమా! అట్టి కృప దేవుడు మా కుటుంబానికిచ్చి బలపరచి, స్థిరపరచి, ఘనపరచి నడుపుతున్నందుకు మన తండ్రియైన దేవునికి మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాము. 'మా కొరకు ప్రార్థించుడి'. -క్రైస్తవనాడు కుటుంబం.

# వాక్యమా? లౌక్యమా? & బ్రదర్ అంటే...! ②



**★ నా వాక్కు ఎవనికుండునో వాడు 'సత్యమును' బట్టి నా మాట చెప్పవలెను; 'ధాన్యముతో' 'చెత్తకు' ఏమి సంబంధమా?**

(గత సంచిక తరువాయి)

లౌక్యం వినసొంపుగా ఉంటుంది. దురదచెవులు గలవారిని మరీ ఆనందింపజేస్తుంది. తుదకు అది దాన్ని ప్రేమించువారిని దేవునికి దూరస్థులను చేస్తుంది. తద్వారా శ్రమలు విస్తరిస్తాయి. అదే దేవుని వాక్యమైతే మనుష్యుల హృదయాంతరాల్లోకి చొచ్చుకెళుతుంది. లేఖనంలో చెప్పినట్లు ఎముకలకు, మూలుగుకు మధ్య దూరేలా ఉంటుంది. అపుడే మనుష్యుల్లో పరివర్తన రాగలదు. వాక్యమన్నది మనుష్యులకు వేగంగా వంటబట్టదు. వాక్యమందు ఎవరికైనా ఆసక్తి ఉంటే ఆ వాక్యమే తన యెడల వారికి ఇష్టం పుట్టించుకొంటుంది.

**★ నీ దేవుడైన యెహోవా తనకు లోబడుటకు నీ హృదయమునకును నీ సంతతివారి హృదయమునకును ఇష్టము పుట్టించును.**(రిఫ.బైబిల్)

హృదయానికి ఇష్టంగా ఏం ఉండాలి? వాక్యమే కదా! హృదయం నిండినదాన్ని బట్టి నోరు మాట్లాడునన్న మాటకు అర్థం - హృదయంలో వాక్యం నిండితే ఆ వాక్యాన్నే నోరు మాట్లాడుతుందని తెలుసుకొనుట విజ్ఞుల లక్షణం. తద్వారానే మనుష్యుల్లో ఓ క్రమంలో మార్పును ఆవాక్యమే తీసుకొస్తుంది. క్రైస్తవబోధకులెవరైనా 'వాక్యాన్ని' బోధించాలి. ప్రభువు చెప్పిన విధంగా 'ఉపమానాలు' చెప్పాలి. అందుకు ప్రభువే మాదిరి.

ఆ ఉపమానాలు మనుష్యులను ఆలోచింపజేసి దేవుని వైపు మరల్చగలగాలి. ఇందుకు సాక్ష్యంగా బైబిల్లో ఓ వాక్యం...

**★ మీ దేవుడైన యెహోవాకు బయపడి ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లు పురుషులేమి స్త్రీలేమి పిల్లలేమి నీ పురములోనున్న పరదేశులేమి 'వాటిని విని' నేర్చుకొనుటకై 'అందరిని' పోగుచేయవలెను. ఆలాగు నేర్చుకొనిన పక్షమున దాని నెరుగని వారి సంతతివారు 'దాని విని'......... మీ బ్రదుకు దినములన్నియు మీ దేవుడైన 'యెహోవాకు బయపడుట' నేర్చుకొందురు.**

లౌక్యంగా మాట్లాడుతూ... వాక్యాన్ని అసలే పట్టించుకోకుండుట ఎంతవరకు న్యాయం? లౌక్యాన్ని బోధించేందుకు, లోకసంబంధ బాంధవ్యాలను గురించి కౌన్సిలింగ్ చేసేందుకు అనేకులున్నారు. క్రైస్తవబోధకులు అందుకు అతీతులుగా ఉండాలి. ఎందుకంటే మనం బోధించేది ఈ లోకజ్ఞానం కాదు. ఈలోకంలో ఎటువంటి బోధలైనా, కట్టుబాట్లైనా, కౌన్సిలింగ్‌లైనా వ్యక్తుల్ని నడిపేది కొన్నాళ్లేనని చూస్తుంటాం. తర్వాతి దినాల్లో ఆయా పద్ధతులను పాటించేవాళ్లు వాటిని విడచి షరా మామూలుగానే తమ జీవితాలను గడుపుతుంటారన్నది జగద్విదితమే! 'వాక్యం' వల్ల మార్పు చెందిన వారు తమ పాత జీవితాలను వీడి క్రీస్తులో నూతన జీవితాన్ని కన్పరుస్తూ ఆ మార్పును అందరూ తెలుసుకోనేట్లు జీవిస్తుండుట లోక విధితమే! అందుకు సాదృశ్యంగా అనేక సాక్ష్యాలు వింటుంటాం, లేక చూస్తుంటాం. దానిక్కారణం.... దేవుని వాక్యంలోగల శక్తి మాత్రమే. ఎంతమంది మన దగ్గరకొచ్చారన్నది ప్రాముఖ్యసంగతేకాదు. సంఖ్య మనల్ని అహంభావానికి లోనుచేయెచ్చు. కాబట్టి మనదగ్గరకొచ్చి వాక్యం వింటున్న వారెందరి జీవితాలు దినదినం మార్పు చెందుతున్నాయా లేదా అన్నది చూసుకొనుట ప్రాముఖ్యం.అది ఓ మంచి కాపరి లక్షణం. లెక్క అప్పగించాల్సింది కాపరే. దేవుడు లెక్క అడుగుట మొదలు పెట్టినప్పటినుండి ఎందరో కాపర్లు శ్రమల పాలౌతున్నారు. కాపర్లు, సువార్తికులు లేక దేవుని సేవకులు ఏ పేరైతేనేం మీ భోధలు వింటూ మీ చెంతకు వచ్చే వారిలో ఎందరు దేవుని రాజ్యంలో ఉండేందుకు సిద్ధపడుతున్నారు? ఆలోచించాలి! అన్నివేలమంది, ఇన్ని వేలమంది వస్తున్నారని ప్రచారం చేసుకొనుటకిది వ్యాపారం కాదు. వచ్చేవారందరూ కష్టమర్లుకారన్నదీ గుర్తెరగాలి. క్రైస్తవనాడులో ఇవ్వబడుతున్న ప్రతీ వివరణా లేఖనానుకూలమే. మీకెట్టి సందేహాలున్నా ఉత్తరాల ద్వారా సంప్రదించండి. తగు సమాధానాలు అందరి మేలు కొరకై ఇచ్చేందుకు మా వంతు ప్రయత్నం మే చేస్తాం. ఈ శీర్షికలో ఇటువంటి అనేక సంగతులు ప్రస్తావిస్తాం. మాకొరకు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకోవాలని కోరుతున్నాం. *-ఎడిటర్*

తదుపరి సంచికల్లో పేర్లకు ముందూ... వెనుకా తగిలించుకొనే బిరుదులు... డిగ్రీలను... గురించి వివరిస్తాం. చదవండి! దేవుని వాక్యంలో బలపడండి!! మరింత తెల్సుకొనేందుకు ఉత్తరాలు వ్రాయండి!!!

# విశాఖయే తెలుగు బైబిలుకు పుట్టినిల్లు!

పరిశుద్ధ గ్రంథమైన బైబిలుకు మరొక పేరు సత్యవేదము. ఈ వేదము తెలుగులో ఏవిధముగా ఎన్ని దశలలో ఎంత మంది వ్యక్తుల శ్రమతో ఆవిర్భవించినదో వాటి పరిణామ క్రమము తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతియొక్క తెలుగు క్రైస్తవునికి ఉండటం సహజం.

ఇప్పటికి 300 సంవత్సరాలకు పూర్వము అనగా క్రీ.శ.1712 వ సంవత్సరములో బొర్తొలోమయి జీగిన్‌బాగ్ అను ఒక మిషనరీ దక్షిణ భారత దేశములోని ట్రాంకుబారు పట్టణములో మొట్టమొదటిగా తెలుగుబాషలోనికి క్రొత్తనిబంధనను తర్జుమా చేయుట ప్రారంభించెను. కాని ఈ మిషనరీ తర్జుమా పూర్తికాకముందే క్రీ.శ.1719వ సంవత్సరమున పరమునకు చేరుకున్నారు.

బొర్తొలొమయి జీగిన్‌బాగ్ ప్రారంభించిన ఈక్రొత్త నిబంధన తర్జుమా పనిని షుల్జ్ అను జర్మనీ మిషనరి క్రీ.శ.1719 సంవత్సరము నుండి కొనసాగించెను. ఇతడు బహుబాషాకోవిదుడు, గొప్ప పండితుడు. ఇతడు ప్రభువు ప్రార్ధనను ఎనిమిది బాషలలో తర్జుమా చేసి దానిని తాటాకులు పై వ్రాయించి ప్రజలకు పంచిపెట్టెను. షుల్జ్ క్రీ.శ.1732 నాటికి పాత నిబంధన గ్రంథాన్ని తెలుగులోనికి తర్జుమా చేసి ఆ వ్రాతప్రతిని జర్మనీలోని హాలీ విశ్వవిద్యాలయము పుస్తక భాంఢాగారంనందు ఉంచినచో భద్రముగా వుండునని తలచి దానిని విశ్వవిద్యాలయమునకు అప్పగించుట జరిగినది. అతడు వీలుకలిగినపుడు దానిని అచ్చువేయించ వచ్చునని తలచినాడు. కాని ఈ వ్రాతప్రతి యొక్క ప్రాముఖ్యత వారికి తెలియనందువలన దానిని ఎచ్చటో అశ్రద్ధగా పెట్టిరి. తరువాత దానికొరకై వెదికిరి గాని ఎవరికి దొరకలేదు. ఇట్లు అనేకులు పరిశుద్ధ గ్రంథమును తెలుగు భాషలోనికి తర్జుమా చేసినా చివరకు వారి ప్రయత్నాలు ఫలించలేదు. వీరి తరువాత ప్రభువు ప్రేరేపణ వలన ఈ పనిని చాల మంది కొనసాగించుచుండిరి గాని, తమ ప్రయత్నాలు మాత్రము వీడలేదు.

క్రీ.శ.1795 సంవత్సరములో కెప్టెన్ డాడ్సు అను ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి పరిశుద్ధాత్మచే ప్రేరేపించబడిన వాడై బైబిలును తర్జుమా చేయుట మొదలుపెట్టి క్రొత్తనిబంధనలో కొంతభాగమును తెలుగులోనికి తర్జుమా చేసెను.

మరియొక సంవత్సరకాలములో ఈపని ముగియనుండగా కెప్టెన్ డాడ్సు మరణించెను. డాడ్సు చేసిన పనియొక్క విలువను గ్రహించలేకపోయిరి అతని సహోద్యోగులు. అందుచేత బైబిలు తర్జుమా యొక్క వ్రాతప్రతిని గూర్చి శ్రద్ధలేక ఎక్కడినో పెట్టిరి. తరువాత కాలములో ఆవ్రాత ప్రతిని ఒక చిత్తు కాగితములు కట్టగా భావించి కొంతకాలమైన తరువాత వారు వాటిని తగులబెట్టిరి.

తదనంతరకాలములో తెలుగుభాషలోనికి బైబిలును అనువదించిన వారిలో ముఖ్యులు విలియంకేరి, మార్ష్‌మన్, వార్డ్ అనువారు. వీరు సిరంపూరు త్రిమూర్తులుగా క్రైస్తవలోకానికి సుపరిచితులు. వీరు క్రీ.శ.1805 సంవత్సరములో క్రొత్త నిబంధనను తర్జుమా చేయప్రారంభించి ఆరు సంవత్సరములలో దానిని పూర్తి చేసియున్నారు. ముద్రణకు అంతయు సిద్ధమైన తరువాత క్రీ.శ.1812 సంవత్సరములో అచ్చువేయు ముద్రణాలయమునకు నిప్పంటుకొని ముద్రించబడిన కాగితములు, విలువైన వ్రాతప్రతులు, అచ్చులు కాలిపోయినవి. చివరకు వీరు చేసిన కృషియావత్తు నిష్ఫలమైనది.

ఇదే సమయములలో లండన్ మిషనుకు చెందిన జార్జిక్రాన్, ఆగస్టీన్ డిగ్రాంగు అను యిరువురు మిషనరీలు విశాఖపట్టణంనకు వచ్చి బైబిలును తెలుగులోనికి అనువదించుటకు ప్రయాసపడి యున్నారు. వీరు క్రీ.శ.1804 సంవత్సరములో విశాఖపట్టణమునకు చేరగానే బైబిలును తెలుగులోనికి అనువదించ మొదలుపెట్టిరి. డిగ్రాంగు తర్జుమా పని కొనసాగించుటలో ఆనందరాయర్ అను వొకని



**బ్రదర్ కె. చిట్టిబాబు**
అసిస్టెంట్ డైరెక్టర్, రాష్ట్ర పురాతత్వ పరిశోధనశాఖ, విశాఖపట్నం

సహాయయు తీసికొనెను. ఈ ఆనందరాయర్ బ్రాహ్మణ కులమునుండి క్రైస్తవుడిగా మారిన వ్యక్తి. వీరిద్దరు రెండు సంవత్సరాల కాల వ్యవధిలో క్రొత్త నిబంధనలో పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక ఆఖరివరకు తెలుగులోనికి అనువదించిరి.


(వచ్చే సంచికలో...)

లోకోక్తి : సుగుణమే జ్ఞానం అన్నది సోక్రటీస్

బైబిల్స్, క్రైస్తవ సాహిత్యాలు, పాటల/ ప్రసంగాల సిడిలు, పుస్తకాల కొరకు
**Heaven Way Bible House**
డో.నెం. 8-11-25, లతా హాస్పిటల్‌కి వరుణ్ బజాజ్‌కి మధ్యన హెవెన్ వే రోడ్డు, పాత గాజువాక, విశాఖ -26
ఫోన్స్ : 0891-6645154 9396235152

**Shalom Leather Works & SOUND SYSTEMS**
● COLLEGE BAGS ● SCHOOL BAGS
● TRAVEL BAGS ● LAPTOP BAGS
● CONFERENCE BAGS
● EXECUTIVE BAGS
● BIBLE COVER ● PASTOR BAGS
● COMPLIMENTARY BAGS
WE MANUFACTURE ALL KINDS OF BAGS
M.TIMOTHY,
PLOT NO: 6 BEHIND SBH, P.M.PALEM, VSP -530041
PH:9885953227

Rokkam Raju
**SHARON SERVICES**
(REPUTED CHRISTIAN)
**DESIGNERS & PRINTERS**
HYDERABAD
CALL : 9247859435, 9705211609




# చాకిరేవు

-ఎడిటర్

*(గతసంచిక తరువాయి....)*

దేవునితో మాట్లాడు అవకాశం మనకు ప్రార్థనిస్తే ఆ అవకాశాన్ని ఆశాశ్వతమైన ఈ లోక సంబంధమైన వాటిని అడుగుటకు వాడుకోవచ్చా?! ఒక వేళ అడిగారనుకోండి వాటిని దేవుడిస్తే వాటిని అనుభవించుటకు మన శరీరారోగ్యం బాగుండాలి కదా! అప్పటివరకు జీవించి ఉండాలి కదా? లోకానికి సంబంధించినవి మనం చేసుకొన్నవి. వాటిని మనం సంపాదించిన దనంతో కూర్చుకోవచ్చు. వాటికంటే మంచి వాటినీ కొనుక్కోవచ్చు. కాని శరీరానికి సంబంధించిన ఆరోగ్యాన్ని, కుటుంబ సంక్షేమాన్ని ఎవరిస్తారు? దేవుడేకదా. శరీరానికి సంబంధించి ఏ రుగ్మత వచ్చినా ధనంతో బాగుచేసు కోగలమనకొనుట కేవలం అమాయకత్వం మాత్రమే. అదే నిజమైతే ఈ లోకంలో ధనవంతులెవరూ అనారోగ్యంతో ఉండరు, చావుకులోనవరు. కాబట్టి మన వల్ల కానివాటిని అనగా మానవులకు అసాధ్యమైన వాటికొరకు దేవుని వేడాలి. అతి స్వల్ప విషయాలనకొరకు ఎదుటి వారిని ప్రార్థించమని అడుగుతూ వారికి లోకువ కారాదు. అత్యున్నతమైన దేవునితో మాట్లాడునప్పుడు మనం కోరేది అత్యున్నతంగానే ఉండాలని గుర్తుంచుకొనుట అవశ్యం. ఉదాహరణగా వీధికాలువకు గట్టుకట్టించమని మనతో ముఖాముఖిగా మాట్లాడుటకు అవకాశమిచ్చిన ముఖ్యమంత్రిని అడుగుతామా? అడగలేముకదా. వీధికాలువలను గూర్చి వార్డు మెంబర్లను అడగాలి. అలాగే పనిని బట్టి మనమడిగే నాయకుల స్థాయి మారుతుంది. ఇప్పుడైనా ఆలోచించండి! అందరికి అధికారి, పరిపాలకుడైన ప్రభువును అడిగేది ఎట్టి విధమైనదిగా ఉండాలో! మా కొరకు ప్రార్థించండి అని ఒకరి కొకరు 'ఫ్యాషను'గా చెప్పుకొనుట అత్యంత బాధాకరమని దేవుని మనసెరిగిన క్రైస్తవ పెద్దలెందరో అభిప్రాయపడుతున్నారు. వారి మాటల్లో గల ఆవేదనే నేను మీకీ శీర్షిక వ్రాయుటకు అవకాశం కల్పించింది. ప్రార్థించండి! అని ఇకపై ఎవరూ ఎదో మామూలుగా అనరాదని వారభిప్రాయమే కాదుగాని నా అభిప్రాయం కూడా. వారి మాటల్లో నాకైతే ఎంతో నిజం కనబడుతోంది. మీకెలా అన్పిస్తుందో మాకు వ్రాయండి. అనేకుల అభిప్రాయాలు మరెందరో ప్రభువునెరుగుటకు మేలు చేస్తాయని మా నమ్మకం. మనం కోరేవి దేవుని దృష్టిలో గొప్పవిగా కనబడాలి. అవి దైవోద్దేశాన్ని నెరవేర్చునవై ఉండాలి. మన ఉద్దేశాలను నెరవేర్చుకొనుటకు కోరేకోర్కెలు దేవుడెప్పటికి తీరుస్తాడో చెప్పలేం. ఆయన చిత్త ప్రకారం మనమేది అడిగినా అది వెంటనే నెరవేర్చే దేవునినే మనం కలిగియున్నామని ఎల్లప్పుడు గుర్తుంచుకోండి. ఆయనకు మనం పిల్లలం. పిల్లలకోర్కె తీర్చుట తండ్రికిష్టమే. కాబట్టి మనకోరే కోరిక వల్ల వచ్చినవేవైనా మనల్ని దేవునికి దూరం చేస్తాయెమోనని జాగ్రత్తగా చూచుకోవాలి. దేవునిని, ఆయనను ఆనందింపజేసే విధంగాను, దేవుని పనులు నెరవేర్చుటకు ఉపయో గకరమైనవిగాను ఉన్నవాటిని మనం కోరితే దేవుడు తప్పక అనుగ్రహిస్తారు.అది తెలిసినా మనలో కొందరు ఎన్నాళ్ళనుండో ప్రార్థిస్తూ అడుగుతున్నను పొందని వారుగానే కనబడతారు. ఇంకొందరు గొప్పగా ప్రార్థిస్తామని చెప్తుంటారు. ప్రార్థనకే అధిక సమయం వెచ్చిస్తామని చెప్పువారును గలరు. కాని వారి ప్రార్థనలకు జవాబులేదంటుంటారు. అంటే వారి కోర్కెకలు తీరుట లేదని గ్రహించవచ్చు. ఎందుకిలా జరుగుతుందని వారికై వారు ఆలోచించుకోవాలి.

*(వచ్చే సంచికలో...)*

# బైబిలుపై సందేహాలు, ప్రశ్నలు - జవాబులు

★ అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరు మూయించుటే దేవుని చిత్తం.

*ప్రభువునందు ప్రియులకు!* చాన్నాళ్ల నుండే పై విషయంలో అనేక తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అది మనలో అత్యధిలకు తెలిసిన సంగతే.అయితే కొన్ని సార్లు ఆయా ప్రశ్నలవల్ల విశ్వాసుల్లో అనేకులకు దేవుని యెడల అనుమానం వస్తుండుట సహజం. కొందరిలోనైతే విశ్వాసమే సడలిపోవుటకు ఆస్కారమేర్పడుతుందని వింటుంటాం. కొందరు క్రైస్తవులు కూడా ఇట్టి వాటివల్ల ముస్లింలుగా మారిన వైనం అక్కడక్కడ చూడగలం.అందుకనేక కారణాలుండొచ్చు గాని ప్రధమ కారణంగా వారు ఆయా ప్రశ్నల్నే చూపెడుతుంటారు.వాటికి జవాబులు దొరక్కే సత్యం కోసం ఆలోచించే మేము బైబిలును విడిచామంటూ చెప్పుకొస్తుంటారు. ఇటువంటి వెన్నో మా దృష్టికొచ్చాయి, వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న నిర్ణయానికి క్రైస్తవనాడు వచ్చింది.ఇదే ఆలోచన కలిగిన వారిలో క్రైస్తవనాడు ఓ భాగమైంది. ప్రతి ప్రశ్నకు లేఖనాను కూలంగా జవాబులిస్తూ అందర్నీ ఆయత్తపర్చడమే క్రైస్తవనాడు ముఖ్యోద్దేశం. ఈ జవాబులు క్రైస్తవులందరికి చేరాలంటే ఒక్క క్రైస్తవనాడుకే సాధ్యం కాకపోవచ్చు, కాబట్టి చదివిన వారందరూ ఆయా జవాబులను ఇతర క్రైస్తవులతోను, ప్రశ్నించే క్రైస్తవేతరులతోను పంచుకోండి. తద్వారా అట్టి ప్రశ్నలు మరెవ్వరూ వేయకుండునట్లు చేయగలం. రండి! మరెందుకాలశ్యం? మనం కూడి బైబిలు ఔన్నత్యాన్ని లోకానికి చాటుదాం. మన తండ్రియైన దేవునిని, మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు వారిని అందరిలో మహిమ పరుద్దాం. తద్వారా మనం మహిమపరచబడదాం.

***ప్రశ్న:** వ్యభిచారం చేస్తూపట్టబడినస్త్రీని యేసు రాళ్లతో కొట్టలేదు. కాబట్టి ధర్మశాస్త్రాన్ని నెరవేర్చలేదు. జనసమూహంలో అందరూ పాపం చేశారు కాబట్టి కొట్టలేదు. మరి, యేసు కూడా కొట్టలేదంటేదానిక్కారణం ఆయన పాపం చేశారనే కదా అర్థం! అందువల్ల ధర్మశాస్త్రాన్ని కొట్టి వేయుటకు రాలేదని నెరవేర్చుటకే వచ్చానన్న ఆయన మాటనే ఆయన తప్పారు. యేసు మొదటిగా ధర్మశాస్త్రాన్ని ఉల్లంఘించారా లేదా? ఆయన మాటను ఆయనే తప్పి అబద్ధికుడవలేదా?*

***జవాబు :*** ప్రభువునందు ప్రియులకు!

బైబిలు చదువునప్పుడు ప్రతి అక్షరం జాగ్రత్తగా చూచుకొని చదవాలి. అక్షర దోషం అర్థాన్ని చంపుతుందని క్రైస్తవనాడు మొదటినుంచీ చెబుతూనే ఉంది. అలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే తెలుసన్న లేఖనం ప్రకారం బైబిలును ధ్యానించునపుడు ఎవరికైనా దేవుని ఆత్మ తోడుండాలి. అట్టివారు బైబిలునందు ఏ సందేహానికైనా, ప్రశ్నకైనా సరిగా ప్రత్యుత్తరమీయగలరు. ఇక పై ప్రశ్నలకు జవాబు చదవండి. యేసు అక్కడ వారిని చూచి ఏమన్నారో చదవండి.

★ **ఆయన తలయెత్తి చూచి-'మీలో' పాపములేనివాడు మొట్టమొదటి ఆమె మీద రాయి వేయవచ్చునని వారితో చెప్పి....(పెద్దా, చిన్నా, ఎవరూ ఆమెను కొట్టలేదు. వెళ్లిపోయారు.) యేసు తలయెత్తి చూచి - 'అమ్మ' వారెక్కడనున్నారు? ఎవడును నీకు శిక్ష విధింపలేదా? అని అగిడినప్పుడు, ఆమె-లేదు ప్రభువా అనెను. అందుకు యేసు - నేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి 'ఇకను' పాపము చేయకుమని ఆమెతో చెప్పెను.**

ప్రశ్న ఉత్పన్నమైన బైబిలులో సంఘటన పైన మీరు ఆసాంతం చదివారని నా నమ్మకం. యేసు పాపులను రక్షించడానికే ఈ లోకానికి వచ్చారు. శిక్షంచుట లోకంలో యేసే కాదుగాని అందరూ చేయగలరు. దైవ చిత్తమేమంటుంది? పాపి మారు మనసు పొందాలంటుంది. పాపాన్ని విడిచి పెట్టాలంటుంది. యేసులో దైవత్వంపై లేఖనంలో చూడగలం. యేసు వారితో ఏమన్నారు?

'మీలో' పాపంలేనివాడు మొట్టమొదట రాయి వేయమన్నారు. ఎవరూ వేయలేదు. చిన్నవాని నుండి పెద్దల వరకు అక్కడున్న అందరూ వెళ్లిపోయారు. మరి అక్కడున్న యేసు కూడా ఆమెపై రాయి వేయకపోవుటకు కారణం.... 'మీలో' పాపంలేనివాడన్నారే గాని 'మనలో' పాపంలేనివాడు అనలేదు. 'మనలో' అని వారందరితో బాటు ఆయన్ను కూడా కలుపుకొని మాట్లాడితే యేసు తప్పక ఆమె పై రాయి వేయాల్సిందే! కాని ఆయనలా అన్లేదు. గమనించండి! అటువంటప్పుడు యేసు ధర్మశాస్త్రాన్ని అతిక్రమించినదెక్కడ? వారిని ధర్మశాస్త్రం ప్రకారం రాయి వేయుమన్నారుగా? కాబట్టి ఆయన ధర్మశాస్త్రాన్ని అమలుపర్చారు. ఆయన రక్షించడానికే వచ్చానన్నారు. పాపియైన ఆమెను రక్షించారు. ఆయన అబద్ధికుడు కారు. ఆయన ఉన్నతత్వం వ్యభిచారిని 'అమ్మా' అని సంభోదించుటలోనే కన్పడుతుంది. మనలో ఓ వ్యభిచారిని ఎందరు అలా 'అమ్మా' అని పిలువగలరు! ఆలోచించాలి. ఆమెను 'అమ్మా' అని పిలుచుటలోనే కాదుగాని ఆయన వంశావళిలో కూడా పితరుల స్థానంలో వ్యభిచార స్త్రీని చూడగలం. వంశావళిలో పితరులస్థానంలో ఇచ్చిన విలువే తన బ్రతుకు కాలంలో కూడా యేసు వ్యభిచారిణికిచ్చారు. ఆమెను 'అమ్మా' అని సంబోధించి వ్యభిచారిణికి అమ్మ స్థానం కల్పించారు. అది దైవలక్షణం. లేఖన నెరవేర్పు. అట్టి లక్షణాలు సంపూర్ణంగా కలిగియున్న యేసు బైబిల్లో వ్రాయబడినట్లు దేవుని కుమారుడే సుమా! మాబోటి వారందరికి మార్గదర్శులే గాక పూజార్హులు కూడా.

-వైకెయార్

***టిప్స్:***

❑ స్వచ్ఛమైన బాదం నూనె చర్మానికి చక్కని టానిక్‌లా పనిచేస్తుంది. మార్కెట్‌లో దొరికే రకరకాల క్రీములు, లోషన్లకు బదులుగా ఆల్మండ్ ఆయిల్ వాడకం మంచి ఫలితాలనిస్తుంది. చలికాలంలో అన్ని రకాల చర్మతత్వాల వాళ్లూ దీనిని వాడవచ్చు. ముఖంతో పాటుగా చేతులు, కాళ్లకు కూడా (చలికి ఎక్స్‌పోజ్ అయ్యేంత వరకు) రాస్తుంటే మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది. చర్మం మీదున్న మచ్చలు, గీతలు వంటివి తొలగిపోతాయి.

❑ ఒక్కొక్కసారి స్నానం చేసినా, ఏ సబ్బుతో ముఖం కడిగినా తాజాగా ఉన్నట్లనిపించదు. కాలుష్యం చర్మరంధ్రాల్లో పట్టేసినప్పుడు, జిడ్డు మరీ ఎక్కుగా ఉన్నప్పుడు ఇలా ఉంటుంది. ఈ సమస్యపోయి ముఖం తాజాగా, శుభ్రంగా ఉండాలంటే బొప్పాయి గుజ్జు చక్కని మందు. మమూలుగా ప్యాక్‌కు వాడేకంటే ఎక్కువ మోతాదు గుజ్జు అవసరమవుతుంది. ముందుగా సగం గుజ్జును ముఖానికి, మెడకు పట్టించాలి. పది నిమిషాల తర్వాత తుడిచేసి ముఖానికి ఆవిరిపట్టాలి. ఆవిరి పట్టిన తరువాత మిగిలిన గుజ్జుతో ప్యాక్ వేయాలి. ఆరిన తరువాత చన్నీటితో కడగాలి.

# బైబిలు చదివి గ్రహించుటకు సులువైన మార్గం...!

- వై.కనకరాజు

ప్రభువునందు ప్రియులకు, నేడు సంఘాలలో అనేకులు బైబిలు ప్రాశస్త్యాన్ని గ్రహించినవారుగా కనబడుతున్నారు. మునుపటి రోజుల కంటే నేటి దినాల్లో యువత నుండి ముదుసలి వరకును బైబిలును అవగాహన చేసుకొనుటకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆ ఒరవడిలో వారికి అనేక సందేహాలు కలుగుట సహజం. మేము అనేక ప్రాంతాలలో చేసిన సర్వేల వల్ల ఈ విషయం గ్రహించాం. అయితే ఎవరిని అడగాలి. జవాబెలా పొందాలి అన్నది తెలియక మిన్నకుండి పోతున్నవారును అక్కడక్కడ కనబడ్తుంటారు. కొందరికైతే ప్రశ్నించి పరిపూర్ణంగా తెలుసుకోవాలనే ఆసక్తి వున్ననూ అడుగుట నామోషిగా భావిస్తుండొచ్చు. ఒకవేళ అడిగినా తగిన సమాధానం ఇచ్చువారెవరు? ఇవన్నీ ఆలోచించి మీ క్రైస్తవనాడు ఈ శీర్షికను ప్రవేశపెట్టింది. ఆసక్తిగల వారందరు మీకున్న ప్రతి సందేహం వ్రాసి తగు వివరణ పొందండి. బైబిలును మనం ఎంత ఎరుగుటకు ఇష్టపడితే లోకంలో అంత ఉన్నతులముగా తీర్చిదిద్దబడుతామన్నది గ్రహించాలి. వాక్యమే దేవుడని బైబిలు స్వసాక్ష్యమిస్తుంది. వాక్యమైన దేవుని ఎరుగుటకు మీ ప్రశ్నలు సంధించండి. మీతో పాటు మేమును దేవుని మరెక్కువ ఎరుగుటకు సంపూర్ణంగా బైబిలును పరిశోధిస్తాం ! ఎందరో పండితులను కలిసి మీ సందేహాలను తీర్చు టకు మా వంతు ప్రయత్నం చేస్తూ సహకారమందిస్తాం . ఇదొక గొప్ప అవకాశంగా భావించండి. రండి ! మనందరం ఏకమై బైబిలు ఔన్నత్యాన్ని లోకానికి చాటుదాం. మా పరిచర్యలో అనేక ప్రాంతాల్లో పర్యటించునపుడు ఎందరో ఆసక్తి కలిగి అడిగిన సందేహాలు ఎన్నో వాటికి తగు సమాధానాలు మీరు చదివే ముందు బైబిలుపై అవగాహన కోసం సులువుగా గ్రహించుటకు కొంత వివరణ మీ కోసం... బైబిలుపై సందేహాలు ఎందుకొస్తాయి.? ఎందుకంటే దేవుని దివ్య జ్ఞాన గ్రంథమైన బైబిలు, లోకులు సామాన్యంగా వ్రాసిన నవలల్లా, గ్రంథాల్లా, కావ్యాల్లా, పద్యాల్లా ఉండదు. లోకజ్ఞానంతో వ్రాసినవేవైనా మొదలు నుండి చివరి వరకూ ఒక క్రమ పద్ధతిలా మొదలై ముగుస్తుంటాయి. అందువల్ల ఆయా గ్రంథాలు సులువుగా అర్ధమవుతాయి. బైబిలుదొక ప్రత్యేకశైలి. దేవుడు తన ఉద్దేశ్యాన్ని బైబిలునందు ఎక్కడా ఒకే చోట చెప్పలేదు. ఒక క్రమంలో మొదలుపెట్టి ముగించలేదు. అలా ముగిస్తే బైబిలు సులువుగా అందరికి అర్ధమయ్యేది. బైబిలు అలా కాకుండుట వల్లే లోకంలో బైబిలుపై జరిగనన్ని తర్జనభర్జనలు మరే గ్రంథంపై జరగలేదని పండితులు చెప్తుంటారు. ప్రతి గ్రంథానికి లేక పుస్తకానికి ముందుమాట ఉండి గ్రంథ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ సులువుగా ఎలా అర్థం చేసుకోవాలో నేర్పుతుంది. రచయిత ఉద్దేశ్యాన్ని ముందుమాటలో గ్రహించుట వల్ల ఆయా గ్రంథాలు చదువరులందరికి సులభంగా అర్థమవుతుంటాయి. బైబిలును ఎలా చదవాలి? ఎలా గ్రహించాలి? తెలుసుకుందాం! బైబిలు దేవుని జ్ఞానమని క్రైస్తవులమైన మనం సంపూర్ణంగా విశ్వసిస్తాం. కాబట్టి బైబిలును ఎలా చదివి గ్రహించాలో దేవుడే చెప్పాలి. దేవుడు తన ఉద్దేశ్యాన్ని, మనుష్యుల యెడల తనకున్న ప్రేమ, ఆలోచనలు తెలియజేయుటకు బైబిలిచ్చాడని మనం నమ్ముతున్నాం. అందువల్ల దేవుడు తన మనస్సును బైబిలు ద్వారా మనం ఎలా చదివి గ్రహించాలో తెలిపారు.

**★ కొంత ఇచ్చట కొంత అచ్చట యెహోవా వాక్యము మీకు వచ్చును.**

పై వాక్యాన్ని బైబిలుకు దేవుని ముందుమాటగా మనం భావించవచ్చు ! పై లేఖనాన్ని బట్టి దేవుడు తన ఉద్దేశ్యం అది దేనికి సంబంధించినదైనా ఒకే చోట చెప్పలేదని గ్రహించాలి. కొంత ఒక చోట మరికొంత ఇంకొకచోట వ్రాయించాడని గ్రహించాలి. విశ్వాసం గూర్చియైనా, ఉపవాసం గూర్చియైనా రక్షణ గూర్చియైనా వ్రాయించిన వాక్యము ఒకచోట ఉండదు. అనేక చోట్ల బైబిలునందు ఉంటాయి. అవన్నియు ఏరి కూర్చి ఒక క్రమంలో పెట్టి చదివి గ్రహించినవారికే బైబిల్లో గల దేవుని మనస్సు అర్ధమవుతుంది. అంతేగాని ఏదో ఒక లైను లేక వచనం పట్టుకుని అదే నిజమనుకొని బోధించు వారెవరైనా ఎదుటివారు సంధించు ప్రశ్నలకు తడబడుట ఖాయం. తగు వివరణ ఇవ్వలేరు. (వచ్చే సంచికలో...)

---

*బైబిలుపై సందేహాలు, ప్రశ్నలు వాటికి జవాబులు ఈ సంచికనుండే ఇవ్వబడుతున్నాయి. పాఠకులు గమనించి, చదివి వాటిని అనేకులతో పంచుకోండి. తద్వారా బైబిలు ఔన్నత్యాన్ని లోకానికి చాటండి. మనకట్టి భాగ్యానిచ్చిన 'దేవునికి స్తోత్రము'.*

*-ఎడిటర్*

## ప్రభువునందు నిద్రించిన



విశాఖలో రెవ. డా. ఎం.ఎ.పాల్ తో సహా ఆ తరము వారిననేకులను రెవ. డా. ఇ.ఎమ్. జార్జిరాజు ప్రభువునందు నడిపించారని విశాఖ వాసులు చెప్పుకుంటారు.

## రెవ.డా. ఇ.ఎమ్. జార్జి రాజు

## అవునా? కాదా?

- వై.కనకరాజు

తండ్రియైన దేవునిని, ప్రభువైన యేసుక్రీస్తుని ప్రతి దినం బైబిలు ప్రకారం ఎరుగుతూ కలిగి ఉన్న వారు తామెరిగింది, అది తెలియని ఇతరులకు తెలిపే క్రైస్తవులు... పరలోకం గురించే మాట్లాడతారు. తద్వారా ఈ లోక మహిమాశీర్వాదాలు వారి పాదాల చెంతకు చేరుతాయి. అలా చేయని వారు క్రైస్తవులనిపించు కొంటున్న వారే! వీరెంత సేపూ 'నరలోకం' గురించే మాట్లాడతారు. తద్వారా ఈ లోకరాజ్యాలు, వాటి మహిమ వీరిని పరిపాలిస్తాయి. వాటికి బానిసలై కుటుంబం తలో ప్రాంతానికి విడిపోవుటకు వీరే కారకులవుతారు. చివరకు వృద్ధాప్యంలో డబ్బున్నా... ఒంటరిగా ఏ దిక్కూలేని, ఏ సంతోషంలేని దుర్భర జీవితాలను గడుపుతుంటారు. బిడ్డలు, కోడళ్లు, అల్లులు, మనుమలు, మనుమరాండ్రు వీరికి ఎండమావుల్లాంటి వారే. అంతకు మించిన 'నరకం' వీరు చూసేది చావు తర్వాతే. కుటుంబం దేవునిలో (వాక్యంలో) పెరగనప్పుడు ఎవరికైనా ఇట్టి జీవితం 'ఉచితంగా' సంక్రమిస్తుంది. దేవుడు ప్రేమాస్వరూపి. మీ జీవితం ఇలా ఉంటే వెంటనే దేవుని క్షమాపణ వేడండి. ఆయన సేవలో భాగస్తులవండి. అనేక మంది అక్కరగల సేవకులకు సహకరించండి. దేవుని ఆశీర్వాదమంటే ఎలా ఉంటుందో మీకు అప్పుడు తెలుస్తుంది.

## కావలెను

ప్రతి జిల్లాలో క్రైస్తవనాడు ఉపకార్యాలయాలను ప్రారంభించాలనుకుంటున్నాం. కార్యాలయ నిర్వాహణ, జిల్లాలో గల ముఖ్య సంగతులు మరియు సంఘాలలో జరిగే కార్యక్రమాల వివరాలు సేకరించుట యందు ఆసక్తి గల వారు సంప్రదించండి.

**ఫోన్స్ : 9490266640, 9346960601**

క్రైస్తవనాడు మరింత విస్తరింపజేయుటకు పెట్టుబడి పెట్టుటకు ఆసక్తిగలవారు సంప్రదించండి.

*లోకోక్తులు* : ❁ మానవ హక్కులకు గౌరవం లభించినప్పుడు మాత్రమే మహిళాసాధికారత సాధ్యమౌతుంది : మనాజ్ అఫ్ఖమీ, ఇరాన్ మహిళా ఉద్యమనేత.

❁ ధైర్యం పుణికి పుచ్చుకోవటానికి తగిన ఆయుధం అహింస : గాంధీ

❁ ఆస్తుల కంటే ఖ్యాతి గొప్పది. ఈ శరీరం నశించినా నిలిచేది అదే : సర్ జగదీశ్ చంద్రబోస్

విజయనగరంలో త్వరలో ప్రారంభం!

బైబిల్ బుక్ హౌస్ & స్టేషనరీ



మా వద్ద అన్నిరకముల బైబిల్లు, బైబిలుకు సంబంధించిన పుస్తకములు, సిడీలు, డివిడీలు మరియు నోట్సు పుస్తకములు లభించును

10-1-30, కొత్తపేట, గౌడ్ వీధి, విజయనగరం-535001

ఫోన్ : 08922-226572

Nanajee CELL : 9885606097

NEW 0866-6626649

COLOURS DIGITAL SIGNS

Flex Banners Front light flex Back light flex Vinyl Publicity boards

Specialist in

Publicity Balloons Funny Costumer Inflatables

27-18-92, Ganesh Complex, 1st Floor, Congress Office Road, Near Hotel Nataraj Complex, Governorpet, Vijayawada- 520002. E-Mail : nanaji_ads@Yahoo.co.in



బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను
పటాపంచలుగావించే.....దుర్భోధకులకు చెక్ పెట్టే....?!

# 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా'

# మందిరం ②

*(గతసంచిక తరువాయి....)*

బైబిల్లో గల వాక్యాలను ఆలోచించి చదివిన వారికి సులువుగా అర్థమవుతుంది. అటువంటి వారే బాగుగా గ్రహించగలరు, బోధించగలరు.

★ **యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ద్యానించువాడు ధన్యుడు**

పైవాక్యం ఎంతనిజమో మనకు తెలుసు. ఈ వివరణ అంతా మీకు దేవుని మాటలు సుళువుగా అర్థం అగుటకు వ్రాసాను. ఇక మందిరం గురించి అలోచిద్దాం.

మత్తయి సువార్తలో 'ప్రార్థన మందిరమన బడును' అని వ్రాయించిన దేవుడు లూకా సువార్తలో ఇలాగే వ్రాయించారు. గాని అందుకు భిన్నంగా మార్కు సువార్తలో 'సమస్త అన్యజనులకు' అని వ్రాయించారు, ఇదేమాటను ముందుగా ప్రవక్తయైన యెషియా ద్వారా దేవుడు పలికి నట్లు చూడగలం. అక్కడ 'సమస్త జనులకు' అని ఉంటుంది.

పైన గల దేవుని మాటల ప్రకారము మనము అన్యులను ప్రభువు లోకి నడిపించుటకు, వారు వచ్చి ప్రార్థించుటకు అనుకూలముగా ఉండే కట్టడము అని అర్థమవుతుంది. దీనికి మరింత వివరణ.

★ **కొందరు మానుకొనుచున్నట్టుగా "సమాజముగా' కూడుట మానక ......**

★ **'ప్రార్థనా స్థలమునకు' వెళ్ళుచుండగా....**

ప్రార్థనామందిరమంటే అనేక స్థలాల్లో మనుష్యులచే కట్టబడుచున్న కట్టడాలని గ్రహించుట అవశ్యం. ప్రార్థనా స్థలాల అవుసరం ఎంతైనా ఉంది. వాటిని గురించి కొంత తెలుసు కున్నారని నమ్ముతున్నాను. దేవుడు తనకు మందిరం కట్టమని చెప్పలేదు. తన పిల్లలమైన మనకు ఇల్లు ఉన్నట్లే దేవునికి కూడా ఉండాలనే మనుష్యుల ఆలోచనకు దృశ్యరూప తార్కాణమే దేవునికి మందిర నిర్మాణం. దేవునికే మందిరం కట్టించుకోవాలనే ఆశ ఉంటే పరిశుద్ధ బైబిలు గ్రంథంలో ఈ మాట ఉండకపోవును.

★ **ఇశ్రాయేలీయులతో కూడా నేను సంచరించిన కాలమంతయు నా జనులను పోషించుడని నేను ఆజ్ఞాపించిన ఇశ్రాయేలీయుల గోత్రములలో ఎవరితోనైనను దేవదారుమయమైన 'మందిరమొకటి' మీరు నాకు కట్టింపకపోతిరే అని నేనెన్నడైనను అనియుంటినా ?**

దేవుడే నాతాను అనే ప్రవక్తద్వారా దావీదును ప్రశ్నిస్తున్నారు. గమనించి దేవుని చిత్తమెంటో గ్రహించండి. దేవుడు కరుణామయుడు, తనపిల్లలను (మనలను) ప్రేమించువాడు.

★ **నా నామమును అక్కడ సదాకాలము ఉంచుటకు నీవు కట్టించిన యీ మందిరమును పరిశుద్ధపరిచియున్నాను. నా దృష్టియు నా మనస్సును ఎల్లప్పుడు అక్కడ ఉండును.**

దేవుడలా వాగ్దానం చేసినను, నెరవేర్చినను తరువాత దినాల్లో దేవుని ఉద్దేశం ఏలాగు మారిందో చూడండి.

★ **అయితే మీరే గాని మీ కుమారులే గాని యేమాత్రమైనను నన్ను వెంబడించుట మాని నేనిచ్చిన ఆజ్ఞలను కట్టడలను అనుసరింపక యితరమైన దేవతలను కొలిచి పూజించిన యెడల నేను ఇశ్రాయేలీయులకు ఇచ్చిన ఈ దేశములో వారిని ఉండ నీయక వారిని నిర్మూలము చేసి, నా నామమునకు నేను పరిశుద్ధపరచిన యీ మందిరమును నా సముఖములో నుండి కొట్టివేసెదను.**

అందువల్ల దేవునికిష్టం లేకపోయినను దావీదు ఆయనకిష్టానుసారుడు గనుక దావీదు కోర్కెను మన్నించాడు కానీ దావీదుకు మందిరము కట్టుటకు అవకాశం ఇవ్వలేదు. సొలోమోనుకు ఆ అవకాశం దేవుడిచ్చినట్లు పరిశుద్ధ గ్రంథంలో చూస్తాం. నిజానికి దేవునికి మందిరం ఎవరు కట్టగలరు? ఎవరూ కట్టలేరు. దావీదు కోరిక ప్రకారం మందిరం కట్టిన తరువాత సొలోమోనుకు జ్ఞానోదయం కలిగింది. దేవుని యొక్క ఉన్నతత్వం అర్థం అయింది. తాను కట్టిన మందిరం దేవునికి నివాసస్థలం కాదని తెలుసుకున్నాడు. అందుకు నిదర్శనంగా అప్పుడు పలికిన సొలోమోను మాటలే మనకు కూడా జ్ఞానం తేవాలి.

★ **నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు. ఆకాశమహాకాశములు సహితము నన్ను పట్టజాలవు. నేను కట్టించిన యీ మందిరము ఏలాగు పట్టును?**

ఈ రోజులలో కూడా అనేకులు దేవుని జ్ఞానం ఎరిగియున్నామని చెప్పుకుంటూ వారు కట్టిన కట్టడాలకు దేవాలయమని పేరు పెట్టుదురు. అలాచెప్పిన వారికి దేవుని శక్తి అర్థం అవలేదని దేవుని జ్ఞానమైన బైబిలు చదివి గ్రహించిన వారు సుళువుగా గ్రహిస్తారు.

★ **ఆయనకు మందిరము కట్టించుటకు చాలినవాడెవడు? ఆయన సన్నిధిని ఆయనకు మందిరమును కట్టించుటకైనను నేనేమాత్రపువాడను? 'ధూపము వేయుటకే' నేను ఆయనకు మందిరమును కట్టదలచియున్నాను.**

దేవునికి మందిరం కట్టించిన సోలోమోనే పై విధంగా ధూపం వేయుటకు మాత్రమే మందిరం అని ఒప్పుకొన్నాడు. ఆ సంగతిని దేవుడు తన గ్రంథమందు వ్రాయించి మనకు సాక్ష్యంగా ఉంచారు. ఇంతకు దేవుడు ఎక్కడుంటారు?

★ **సర్వోన్నతుడు హస్తకృతాలయములలో నివసింపడు.**

అంటే చేతితో కట్టిన వాటిలో ఆయన నివాసము చేయరు. దాని భావం మనం చేతితో కట్టిన వాటిలో ఆయన నివాసముచేయరని గ్రహించాలి. మనం చేతితో కట్టుకున్న వాటిలో మనముంటాము. ఆయన కట్టుకున్న మందిరంలో ఆయన ఉంటారన్నది ఎరుగుటయే విజ్ఞుల లక్షణం. ఆ విధంగా మనమాలోచిస్తే ఆయన కట్టిన మందిరం ఎక్కడుందో తెల్సుకొనుటకు లేఖనాలు ధ్యానిద్దాం.

★ **మీరు దేవుని వ్యవసాయమును దేవుడు కట్టు గృహమునైయున్నారు.**

పై వాక్యాన్ని బట్టి మనమే దేవుని ఇల్లని గ్రమించాలి. మరియు దేవుని కోసం ఫలించే పంటగా మనముండాలి.మనమే ఆయనకు అట్టి ఇల్లయితే మనపై నమ్మకంగా మన ప్రభువైన యేసుక్రీస్తు ఉంటారు. ఇది మనకు ఆశీర్వాదం.

★ **క్రీస్తు కుమారుడైయుండి, ఆయన యింటి మీద నమ్మకముగా ఉన్నాడు; ధైర్యమును నిరీక్షణ వలని ఉత్సహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు.**

కాబట్టి ప్రియురాలా! మానవ దేహమే 'ఆయనమందిరం' 'ఈ దేహమే దేవాలయం' మనందరం భూమిపై దేవున్ని ఎరుగని అనేకులకు దేవున్ని మనలో కన్పరిచి నడిచే దేవాలయాలమని గుర్తుంచుకోవాలి. తండ్రియైన దేవుడు ప్రభువైన యేసుక్రీస్తు మన నుండి కోరేది అదే.

*-వైకెయార్*

# తెలుసుకుందాం!


★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును



❖ 1980 వరకూ భూటాన్‌లో ఒక్క టెలిఫోన్ కూడా ఉండేది కాదు.



❖ ఆవులకు సంగీతాన్ని వినిపిస్తూ పాలు పితికితే అవి మామూలుగా ఇచ్చే పాలకంటే ఎక్కువిస్తాయట. చాలామంది డైరీ ఫారం యజమానులు ఈ పద్ధతి పాటిస్తుంటారట కూడా.



❖ ఒంటె నీళ్ళు లేకుండా ఎక్కువ రోజులు బ్రతుకగలదు. ఒంటే కాకుండా నీళ్లు లేకుండా ఎక్కువ రోజులు జిరాఫీ కూడా బ్రతుకుతుంది.



❖ సాఫ్ట్ డ్రింక్స్ ఎక్కువగా వినియోగించే దేశం స్విట్జర్‌లేండ్.



❖ పాముల్లో అతివేగంగా ప్రయాణించేది బ్లాక్ మాంబా. ఇది గంటకు ఎనిమిది మైళ్లు ఆగకుండా వెల్తుంది.

❖ బ్లూబర్డ్స్ బ్లూ కలర్‌ను చూడలేవు.



❖ తైవాన్‌లోని ఒక కంపెనీ గోధుమలతో ప్లేట్స్ తయారు చేస్తోంది. అందులో వడ్డించిన పదార్థాలతో పాటు ప్లేటును కూడా భోంచేయవచ్చు.


❖ బెల్జియంలో 55 శాతం పార్లమెంటు సభ్యులు స్త్రీలే. అక్కడ స్త్రీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం కల్పించే ప్రక్రియ మొదలైంది 1921లో.

❖ ప్రపంచంలో పెంపుడు కుక్కలకు, పిల్లులకు ఆహారం కోసం వెచ్చిస్తున్న ఖర్చు సంవత్సరానికి ఏడు వందల కోట్లు.

❖ టిమ్ ఫ్లోక్ అనే కార్ రేస్ ఆటగాడు తన కారులో ఓ కోతిని కూడా కూర్చో బెట్టుకునేవాడు. చాలాసార్లు విజయం సాధించటంతో అదో సెంటిమెంట్ అయ్యిందేమో!

❖ కిల్లర్ వేల్ గుండె నీటిలోపల నిమిషానికి ముప్పై సార్లు కొట్టుకుంది. అదే నీటిపైకి వస్తే నిమిషానికి అరవై సార్లు కొట్టుకుంటుంది.

❖ మొట్టమొదట రైల్వే అండర్‌గ్రౌండ్ తవ్వింది లండన్ నగరంలో. దాని పొడవు 253 మైళ్లు.



❖ మొదటిసారిగా వేలిముద్రల ఆధారంగా నేరస్థులను పట్టుకుంది స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులు. 1901లో 'బ్రిటీష్ ఇండియా ఫోర్స్' ఈ విజయం సాధించింది.



❖ ఆకాశం నుండి భూమిమీద పడే వాన చినుకు వేగం సెకనుకు 9.8 న్యూటన్ మీటర్లు. భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్నది న్యూటనే కాబట్టి ఇలాంటి భూమ్యాకర్షణ శక్తి సంబంధిత వేగాన్ని కొలవటానికి 'న్యూటన్ మీటరు' లను కొలబద్దలుగా వాడతారు.

❖ బ్రెజిల్‌లోని ఓ పురాతన రోడ్డులో ఒకదాని పక్కన ఇంకొకటి... అలా ఒకేసారి 160 కార్లు ప్రయాణించగలవు. ప్రపంచంలో ఇదే వెడల్పాటి రోడ్డు.

❖ క్షీరదాల జాతికి చెందిన జీవులలో మగ వాటి కంటే ఆడ జీవులే ఎక్కువ కాలం బ్రతుకుతాయి.

RNI APTEL / 2006 / 17980



## హైద్రాబాద్‌లో... మథర్ థెరిస్సా-09

# అవార్డుల ప్రధానోత్సవం







హైద్రాబాద్ : సామాజిక సేవకులు గుండం నందు 2009 సంవత్సరానికి గాను మథర్ థెరిస్సా అవార్డులు బహూకరించారు. సేవా పరిచర్యలతో అనేకులకు సహకారంగా ఉంటున్నవారికి ఈ అవార్డు లివ్వబడ్డాయి. ఈ కార్యక్రమం స్థానిక ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసారు గుండం నందు. ముఖ్య అతిధిగా రాష్ట్ర హెూం శాఖామంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి హాజరవ్వాలి. కాని కొన్ని అనివార్యపరిస్థితుల వలన ముఖ్య అతిధులుగా ప్రకటించబడిన వారు రాలేకపోయారు. కార్యక్రమంలో... ప్రముఖ సినీ డైరెక్టర్ సూర్యకిరణ్ మరియు ఆయన శ్రీమతి, ప్రముఖ నటి, నిర్మాత కళ్యాణి, నోయల్ ఫార్మా అధిపతి ఎడ్వర్డ్, ఎస్.సి. కమిషన్ ఛైర్మన్, ఎడ్వర్డ్‌రోజ్ అంతర్జాతీయ ప్రసంగీకులు, డిప్యూటి కలెక్టర్ జాన్‌వెస్లీ, రెవ. విలియం కేరీ, సువార్తరాజు తదితరులు వేదికనలంకరించిన వారిలో ఉన్నారు. గ్రేటర్ క్రిస్టియన్ యునైటెడ్ రైట్స్ ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ గుండం నందు మాట్లాడుతూ... తాను మునుపు తమ తండ్రి పేరున సేవా పరిచర్యలు జరిగించే వాడినన్నారు. ఇకపై 'గ్రేటర్ క్రిస్టియన్ యునైటెడ్ రైట్స్ ఫోరం' తరపుననే తన సేవలు క్రైస్తవలోకానికి అందిస్తానన్నారు. తాను క్రైస్తవునిగా మారేందుకు జరిగిన సంఘటనలను టూకీగా చెప్పారు. సేవలో భాగంగానే మథర్ థెరిస్సా-2009 అవార్డులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగానున్న అనేకమందికి నాడు అవార్డులు బహూకరించారు. క్రైస్తవ హక్కులకోసం పోరాడుతూ, అవసరత ఉన్నవారికి అన్ని విధాలా సహకరించేందుకు కృషిచేస్తానని గుండం నందు చెప్పారు. అవార్డులందుకున్న వారిలో విశాఖలో సేవా పరిచర్యలు జరిగిస్తున్న బ్రదర్ తాజుద్దీన్ మసీహ్ ఉన్నారు. ప్రముఖ క్రైస్తవ సేవకులైన మోజెస్ చౌదరి ఆధ్వర్యంలో విశాఖలో నడిపిపబడుతున్న మారనాత విశ్వాస సమాజానికి అధినేత సాయిరాం కూడా పాల్గొన్నవారిలో ఉన్నారు. ఈయన క్రైస్తవులకు శైలెష్‌ప్రకాష్‌గా సుపరిచితులు. గ్రేటర్ క్రిష్టియన్ యునైటెడ్ రైట్స్ ఫోరం తరపున ఫౌండర్ ప్రెసిడెంట్ గుండం నందు ఎలాంటి సేవలు చేయనున్నారో వేచి చూడాల్సిందే!

## విశాఖలో... ప్రపంచ ప్రార్థనాదినం

### ఈ ఒక్కరోజు ప్రార్థనా ఏదో చేసేస్తుందని కాదు : పాస్టర్ ఎం.ఎ.పాల్


ప్రసంగిస్తున్న పాస్టర్ ఎం.ఎ.పాల్

ఆరిలోవ : స్థానిక స్కూల్ గ్రౌండ్‌లో ప్రపంచ ప్రార్థనాదినం సందర్భంగా ప్రార్థనా సభను ఏర్పాటు చేసారు స్థానిక కాపర్లు జార్జిబాబు, గుంటి అరుణపాల్‌లు. వీరికి పోటీగా(?) కాసింత దూరంలోనే మరో ఫెలోషిప్ వారు ప్రార్థనా కూటమి ఏర్పాటు చేసారు. ఆరిలోవే కాదుగాని గాజువాక ప్రాంతంలోనూ ఇలాగే రెండు గ్రూపులు వారు రెండు కూటములను ఏర్పరచారని తెలుస్తోంది. పాస్టర్ ఎం.ఎ.పాల్ తమ ప్రసంగంలో ఈ ఒక్కరోజు మనందరం ప్రార్థన చేస్తే ఏదో అయిపోతుందని నేను చెప్పడానికి రాలేదన్నారు. అయితే ప్రార్థన ప్రాముఖ్యత ఎంతో, దాని వల్ల మనకు, సమాజానికి కలిగే మేలు ఎంతో అది చెప్పడానికే వచ్చానన్నారు. ప్రసంగానంతరం అనకాపల్లి దరి ఉంటూ క్రైస్తవనాయకులకు, సేవకులకు తమ వంతు సహకార మందిస్తున్న బ్రదర్ కోట సుబ్బారెడ్డి ప్రార్థన చేసారు. ఆ వెంటనే పాస్టర్ ఎం.ఎ.పాల్, బ్రదర్ కోట సుబ్బారెడ్డి తదితరులు మిగితాచోట్ల జరిగే ప్రార్థనా కూటముల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ ప్రార్థనా కూటములు ప్రతియేటా జరిపినట్లే ఈ యేడు విశాఖలో చాలా ప్రాంతాల్లో ఏర్పాటు చేసారు. ప్రపంచ ప్రార్థనాదినం జరుపుట వల్ల ఏం జరుగుతుందో మనకు తెలయదుగాని అవి జరిపేవారిలో ఐక్యతలేకుంటే ఏమీ జరగదని మాత్రం మాకు ఖచ్చితంగా తెలుసని అనేకమంది క్రైస్తవులు నాడు చర్చించుకోవడం కన్పించింది. నిర్వాహకులు ఈ విషయమై వచ్చేయేడాది 'ప్రపంచ ప్రార్థనా దినం' జరిపితే ఆలోచించాలని హితవు చెప్పేవారూ లేకపోలేదు.



ప్రార్థిస్తున్న బ్రదర్ కోట సుబ్బారెడ్డి

శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

## మరనాత వేద పాఠశాల - విశాఖ

మరనాత విశ్వాస సమాజపు పరిచర్య


దైవజనులు
శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

'దైవసేవ-దేశసేవ తత్పరులైన యువతకు అద్భుత అవకాశం'
'వారు..వినని వానిని ఎట్లు విశ్వసించుదురు?
ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు?'
రోమా 10:14

జన్మ, కర్మ పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగునాట చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!!

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య, సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 25 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.

**నిర్వహించు కోర్సు :** 1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సంవత్సరములు (4సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సంవత్సరములు (6సెమిస్టర్లు)

**అర్హతలు :-** రక్షణానుభవము, సేవార్థమైన దేవుని పిలుపు, సమర్పణ, 18సం॥ పైన వయస్సు గలవారు

వాక్యతర్ఫీదు పొందనాసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ. 50/- లు పంపి, పొంది, పూర్తిచేసి వెంటనే పంపించవలెను.

**భోజనము, వసతి :** ఉచితం; **బోధనా భాష :** తెలుగు

స్త్రీలకు ప్రత్యేక వసతి

**ప్రత్యేకతలు**
విద్యార్హతలు, వాక్యపరిజ్ఞానము, స్వదేశి, విదేశీ సేవానుభవం కల్గిన అధ్యాపకబృందం, వ్యక్తిగతశ్రద్ధ, క్రమశిక్షణ, సిద్ధాంత, ఆచరణాత్మక సబ్జక్టుల సమన్వయము

ఏప్రియల్ 12 నుండి మే 21 వరకు 6 వారముల పాటు వేసవి తరగతులు కూడా నిర్వహించబడును.



అప్లికేషన్ చేరవలసిన ఆఖరు తేది : 2010 జూన్ 10



వివరములకు :
రెవ. శిరిపురపు సైలస్ ప్రకాష్ M.Com., M.Div. (U.S.A), డైరెక్టర్
మరనాత వేద పాఠశాల, ఎ.ఎస్.ఆర్. నగర్, సీతమ్మధార, విశాఖపట్నం-530013
సెల్ : 9848124651, 9949277334, 0891 - 2793296, 2504847

### లోకోక్తులు:

❁ సమర్థతకు, ఆశకు మధ్య వ్యత్యాసం వల్లే దు:ఖం కలుగుతుంది.

❁ నీ బాధలకు విశ్రాంతి నివ్వాలంటే వాటిని జ్ఞాన సముద్రంలో వది లెయ్యాలి.

❁ క్షమాపణ అడగటం చాలా గొప్ప విషయం. ఈ గుణంతో ఎలాంటి పొరపాట్లనైనా సవరించు కోవచ్చు. : లిన్ జాన్‌స్టన్.

❁ తాను సర్వజ్ఞుడినని విర్రవీగేవాడే అందరికన్నా మూర్ఖుడు : నెహ్రూ

❁ వ్యక్తిగా ప్రతి ఒక్కర్నీ మనం గౌరవించాల్సిందే కానీ ఎవర్నీ ఆరాధించ కూడదు. : ఐన్‌స్టీన్

## MASTER'S COLLEGE OF THEOLOGY (MCT)

**(A Theological Institute of Vision Natives)**

***Affiliated to Senate of Serampore College (SSC)***

Master's College of Theology (MCT), offers Theological Education under the ministry of *Vision Natives.* MCT trains nationals, as Godly and Dynamic leaders to serve their nation. Medium of instruction is English. Courses begin in the third week of June every year. Dedicated men and women above 18 years may apply. Filled in applications are to reach by 15th May.

COURSES OFFERED

| | | | |
|---|---|---|---|
| Bachelor of Divinity (B.D.) | SSC Degree | 4 Years | Degree Passed from any Recognised University |
| Bachelor of Divinity (B. D) | SSC Degree | 5 Years | XII / Inter Passed (OR) Equivalent |
| Certificate of Theology (C.TH) | MCT Diploma | 2 Years | X Passed |
| Pre-Theology | MCT Certificate | 1 Year | X Passed |

For Application & Prospectus send Rs. 100/- M.O. or Demand Draft in favour of :

Master's College of Theology
Plot No 5-7, Kommadi Road, Madhurawada, Visakhapatnam-530 041, Andhra Pradesh, South India
Phone No : 0891- 2739803 & 2526342 ; e- mail : mctvizag@sify.com



*Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 3-178, 5th Lane, Adarsh Nagar, Visakhapatnam - 530 040, Andhra Pradesh.*
*Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20*